క్లుప్తంగా

పక్కాగా ఎన్‌సీడీ సర్వే



ప్రత్తిపాడు: గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది పక్కాగా ఎన్‌సీడీ సర్వే చేయాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేరి యునిస్ కోరారు. మండల పరిధిలోని యనమదలలో జరుగుతున్న ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) 3.0 సర్వేను మంగళవారం ఉదయం వైద్యాధికారి మేరియునిస్ పరిశీలించారు. సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లారు. మధుమేహం, బీపీతో బాధపడుతున్నారా.. అన్న విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేరియునిస్ మాట్లాడుతూ సర్వేపై అలసత్వం వహించవద్దన్నారు. వెంట పీహెచ్ఎన్ నిర్మల ఉన్నారు.

శివాలయానికి కంప్యూటర్ల బహూకరణ



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ అన్నారు. పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి కెనరా బ్యాంక్ సౌజన్యంతో రూ.1,80,000 విలువ చేసే పీఓఎస్ కంప్యూటర్లు మంగళవారం బహూకరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఏజీఎం యు.రామమోహన్, పెదకాకాని బ్రాంచి మేనేజర్ మన్నెం సీతారామయ్య పాల్గొన్నారు.

కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన

గుంటూరు రూరల్: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో, ప్రత్తిపాడు మండలం యనమదలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసులు శాఖ, స్టెప్, స్వశక్తి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యకార్యనిర్వహణాధికారిణి టీవీ విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కెరీర్ కౌన్సిలింగ్ ట్రైనర్ జి.భార్గవి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సరోజిని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. ఈనెల 11వ తేదీన విజయవాడకు చెందిన నక్కా వెంకటేశ్వరరావు, పెదకాకాని వై జంక్షన్‌లో నివసిస్తున్న స్నేహితుణ్ణి కలిసేందుకు వచ్చాడు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుంటూరు వైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు(48) మంగళవారం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

ప్రభుత్వమే 108 వాహనాలు నిర్వహించాలి



గుంటూరు మెడికల్: ప్రభుత్వమే 108 వాహనాలను నిర్వహించాలని కోరుతూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా 108 వాహనాల సిబ్బంది తమ వాహనాలపై స్టిక్కర్లు అంటించారు. కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనలో భాగంగా 15వ రోజు మంగళవారం స్టిక్కర్లు అంటించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్ మాట్లాడుతూ 108 అంబులెన్సు వాహనాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. తద్వారా ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం వాహన నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అరబిందో యాజమాన్యం బెదిరింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తాము బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లలో భాగంగా వేతనాలలో స్లాబ్ విధానం తీసివేయాలని, వేతనాలను పెంచాలని కోరారు. ఈనెల 11వ తేదీ నుంచి చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 25వ తేదీ వరకు తాము వేచి చూస్తామని, డిమాండ్లకు యాజమాన్యం స్పందించని పక్షంలో 26 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంజుల, శివప్రసాద్, హేమంత్, షేక్ బాబు, జే.వీ.ఎస్. రామకృష్ణ, సుమన్ పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యంతోనే సరి

- గర్భిణులు, బాలింతలకూ నవంబరు నెల నూనె లేదు
- కేంద్రాల్లో చిన్నారులకు ఉన్న దానితోనే మధ్యాహ్న భోజనం

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ లబ్ధిదారులపై అలసత్వాన్ని ప్రదర్శిస్తుంది. రెండు నెలల కిందట అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సకాలంలో సరఫరా చేయకుండా చిన్నారులను పప్పు భోజనానికి దూరం చేసిన ప్రభుత్వం, ఈ నెల నూనెను సరఫరా చేయకుండా గర్భిణులూ, బాలింతలకు మొండిచేయి చూపింది. దీంతో నూనెలేని పోషకాహార వంటలు ఎలా చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి చోటుచేసుకుంటుంది. కాగా ఇదే పరిస్థితి జిల్లా అంతటా అన్ని అంగన్‌వాడీల్లో కనిపిస్తోంది. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులుగా ఉన్న గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం టేక్ హోం రేషన్ ద్వారా ప్రతి నెలా కందిపప్పు, బియ్యం, ఆయిల్‌తో పాటు పాలు, కోడిగుడ్లు సరఫరా చేస్తుంది. కానీ నవంబరు నెల మొదలై పదిహేను రోజులు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం కేంద్రాలకు నూనెను సరఫరా చేయలేదు. దీంతో వందల మంది గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.



అంగన్‌వాడీ చిన్నారులు (ఫైల్)

ఇదీ ప్రాజెక్టు లెక్క..

అంగన్‌వాడీ కేంద్రాలు	: 226
గర్భిణులు	: 948
బాలింతలు	: 744
0- 6 నెలల చిన్నారులు	: 763
6 నెలలు-1 సం॥ చిన్నారులు	: 963
1-3 చిన్నారులు	: 4023
3-6 చిన్నారులు	: 4,547

గత నెల నూనెతో..

ఇదిలా ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఈ నెల నూనెను సరఫరా చేయలేదు. దీంతో గత నెల సరఫరా చేసిన నూనెతోనే ఈ నెల కూడా సరిపెడుతున్నారు. కాగా నూనె స్టాకు లేని అంగన్‌వాడీలు పక్క సెంటరు నుంచి అరువు తెచ్చుకోవడమో లేక, బయట కొనుగోలు చేసి చిన్నారులకు వంట చేసి మధ్యాహ్న భోజనం పెట్టడమో చేయాల్సిన పరిస్థితి.

ఈ నెల నూనె సరఫరా లేదు

నవంబరు నెలకు సంబంధించి నూనె సరఫరా ఇంకా చేయలేదు. స్టాక్ రాగానే కేంద్రాలకు సరఫరా చేస్తాం. నూనె మినహా అన్ని రకాల సరుకులను ప్రభుత్వం ఇప్పటికే అందించింది. లబ్ధిదారులకు పంపిణీ చేశాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా గత నెల సరఫరా చేసిన నూనె కొంత ఉంది. దానితో వంట చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

– వి.సుజాతదేవి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు

ఎయిర్ పిస్టల్ పోటీల్లో సత్తా చాటిన కిట్స్ విద్యార్థి

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న బి.గౌరీనాథ్ ఎయిర్ పిస్టల్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 15వ తేదీన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఇంటర్ కలిజియేట్ టోర్నమెంట్, యూనివర్సిటీ సెలక్షన్ ట్రయల్స్‌లో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పిస్టల్ విభాగంలో పోటీల్లో గౌరీనాథ్ మొదటి స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరీనాథ్‌ను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అభినందించారు. జనవరిలో చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, వ్యాయామ అధ్యాపకులు కొడాలి వెంకటరావు, సీహెచ్ విశ్వనాథసాయి పాల్గొన్నారు.



గౌరీనాథ్‌ను అభినందిస్తున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

మత్తు వదిలితేనే మంచి భవిష్యత్

పెదకాకాని: మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని సీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం పెదకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు వదిలితేనే భవిష్యత్తు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ (స్పీచ్) -పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.భాస్కరరావు పాల్గొన్నారు.

‘పది’ ఫీజు అ‘ధనం’

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్ష ఫీజు పేరుతో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అదనపు వసూళ్లకు పాల్పడ్డారు. స్కానింగ్, ప్రింటింగ్, ఆన్‌లైన్ వర్క్, ఫొటోలు.. ఇలా రకరకాల కారణాలతో విద్యార్థి నుంచి అదనంగా రూ. 25 నుంచి రూ.150 వరకు పాఠశాలను బట్టి వసూలు చేశారు. పదో తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ఫీజును ప్రభుత్వం రూ. 125గా నిర్ణయించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంతకుమించి ఒక్క రూపాయి కూడా హెచ్‌ఎంలు వసూలు చేసేందుకు వీలు లేదు. కానీ ప్రత్తిపాడు మండలంలో మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వసూలు చేశారు. మొత్తం ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా వాటిలో ఆరు పాఠశాలల్లో నిర్ణీత రుసుం కన్నా అదనంగా వసూలు చేసినట్లు సమాచారం.

- వంగిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎగ్జామ్ ఫీజు, ఫొటో ఫీజు, సంతకాలు, స్కానింగ్.. అంటూ మొత్తం రూ.235 ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేశారు.
- పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్కొక్క విద్యార్థి నుండి రూ.200 వసూలు చేశారు.
- గొట్టిపాడు జెడ్పీ హైస్కూల్లో స్కానింగ్, ఆన్‌లైన్, ఫొటోలకు కలిపి రూ.150 తీసుకున్నారు.
- కోయవారిపాలెం హైస్కూల్లో కూడా పది విద్యార్థుల నుంచి ప్రింట్లు తీసి ఇచ్చేందుకు, ఫొటోలు, సంతకాలు స్కాన్ చేసే నిమిత్తం రూ.150 తీసుకున్నారు.
- యనమదల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫొటోల పేరుతో రూ.225 వసూలు చేశారు.
- తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షకు స్కానింగ్ చార్జిలకు కలిపి మొత్తం రూ. 200 రూపాయలు వసూలు చేశారు.

పాఠశాలలకు వచ్చి విచారణ చేస్తా

పది పరీక్షల ఫీజును ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే తీసుకోవాలి. అదనంగా వసూలు చేయడానికి లేదు. ఆయా పాఠశాలలకు నేను వచ్చి విచారణ చేస్తాను.

-పి.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి, గుంటూరు

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి



కాకుమాను: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండల కేంద్రం కాకుమానులోని ఇండియన్ జెమ్స్ పబ్లిక్‌స్కూల్‌లో మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ చిన్నారుల నుంచి పెద్దవారితో సహా ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు ఉన్న వాటిని సరి చేయించుకోవాలన్నారు. బుధ, గురు వారాలలో పబ్లిక్ స్కూల్‌లో కేంద్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం నుంచి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ ఉన్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా

పొన్నూరు: బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా మార్పు చేసే విధంగా, ప్రతి ఒక్కరూ సహకరించాలని పురపాలక సంఘ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తే రూ.500 జరిమానా పది రోజులు జైలు శిక్షకు గురవుతారని హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో మున్సిపాలిటీలో తెలియజేయాలని ఒక ప్రకటనలో కోరారు.

వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ అందజేత



చేబ్రోలు: మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కంప్యూటర్, విద్యార్థులకు పండ్ల మొక్కలను మంగళవారం అందజేశారు. వేజండ్లకు చెందిన ప్రేరణ శిక్షణ సేవా సమితి ప్రతినిధులు సుమారు రూ.40 వేల విలువ చేసే కంప్యూటర్‌ను అందజేశారు. హైస్కూల్‌లోని 200 మంది విద్యార్థులు జామ మొక్కలు పంపిణీ చేశారు. కంప్యూటర్ అందజేసిన ప్రేరణ సమితి ప్రతినిధులు నాగార్జున, సభ్యులను హెచ్ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మార్కింగ్ ఇవ్వాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్, రోడ్ల ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో పూడికతీత పనులు వేగంగా చేపట్టాలని, ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కొరిటెపాడు సెంటర్ నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు జీఎంసీ చేపట్టిన డ్రెయిన్, రోడ్డు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ, గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజీ దగ్గర వెండింగ్ జోన్ ఏర్పాటు మార్కింగ్‌లను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలోని డ్రెయిన్లలో పూడికను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. అనంతరం గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజి రోడ్‌లో ప్రతిపాదించిన వెండింగ్ జోన్‌కు మార్కింగ్‌ని పరిశీలించి, ట్రాఫిక్‌కి అవరోధం కాకుండా, బండ్లు రోడ్ల మీదకు రాకుండా ఉండేలా మార్కింగ్ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమ శేఖర్, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు

ఎన్‌పీసీఐ సర్వే, జియో ట్యాగింగ్ పర్యవేక్షణ లోపంపై 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా జరుగుతున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) సర్వే, ఇళ్ల జియో ట్యాగింగ్ వేగవంతంపై మౌఖికంగాను, టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించినా ఆశించిన స్థాయిలో ఆయా నోడల్ అధికారుల పరిధిలో సర్వే వేగవంతం కాలేదన్నారు. దీనికి బాధ్యులైన 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.



వెండింగ్ జోన్ ఏర్పాటుకు సంబంధించిన మార్కింగ్‌ను పరిశీలిస్తున్న పులి శ్రీనివాసులు

త్వరలో సిటిజన్ రివార్డులు

నగర అభివృద్ధిలో భాగస్వాములు అయ్యే వారికి ప్రత్యేక యాప్ ద్వారా సిటిజన్ రివార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడిచారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ సంస్థ ప్రతినిధి సమీర్ గౌతమ్ సిటిజన్ రివార్డ్స్, అమలు, ప్రజలు వినియోగించుకునే తీరుని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.



నిర్లక్ష్యం..

టార్పాలిన్ లేకుండా వెళుతున్న ట్రాక్టర్

పట్టణంలో చెత్త లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లపై టార్పాలిన్లు కప్పకపోవడంతో గాలికి చెత్త, వ్యర్థాలు, చెట్ల కొమ్మలు ఎగిరి వెనుక వచ్చే వారిపై పడుతున్నాయి. దారి పొడవునా పడుతుండటంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను నిడుబ్రోలు డంపింగ్ యార్డ్‌కు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పట్టణంలోని 31 వార్డులలో చెత్త సేకరిస్తున్న వాహనాలకు టార్పాలిన్ కప్పడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. -పొన్నూరు

కళ్లం కళాశాలలో టెక్ క్యాంప్



గుంటూరు రూరల్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరేందుకు కృషి చేయాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో మూడు రోజులుగా గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు టెక్ క్యాంపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంద మందికి పైగా బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. కళాశాల డీన్ కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పీఎల్ మాధవరావు, సాంకేతిక శిక్షకుడు చందన్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతి మహిళా విద్యావంతురాలై రాణించాలి



పెదకాకానిలో మాట్లాడుతున్న సిస్టర్ సంధ్యారాణి



ప్రత్తిపాడులో ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కాకుమానులో సుహాసినిని సన్మానిస్తున్న దృశ్యం

పెదకాకాని: ప్రతి మహిళ విద్యావంతురాలు కావడం ద్వారానే కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి అన్నారు. పెదకాకాని లూధరిగిరి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 6వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమానికి లైబ్రేరియన్ వేములవిజయకుమార్ అధ్యక్షత వహించారు. మంగళవారం మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, ఉపాధ్యాయులు తులసి, రేష్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు రంగవల్లుల పోటీలు

ప్రత్తిపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.అరుణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన హెచ్ఈ పాఠశాల ఉపాధ్యాయురాలు జీనత్ ఉన్నీసా, పోస్ట్ ఉమెన్ రాయపూడి సుమిత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో 44 మంది విద్యార్థులు పాల్గొని రంగవల్లులను సుందరంగా తీర్చిదిద్దారు. సీనియర్ విభాగంలో ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థినులు వి.అఖిల, పి.స్వాతి టీం, డి.భావన, సీహెచ్ హారిక టీం ప్రథమ స్థానాన్ని, జి.హాసిని, ఎస్.మేఘన టీం ద్వితీయ స్థానం, జె.వెంకట నందిని, ఎస్.తేజశ్రీ టీం తృతీయ స్థానంలో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో పి. అశ్విత, ఎస్‌కే ఆయేషాభాను టీం మొదటి స్థానం, జి.హేమలత, జి.తాన్యాజోయల్ టీం రెండవ స్థానం, ఆఫియా భాను, సహస్రటీం తృతీయ స్థానం సాధించినట్లు అరుణ తెలిపారు. తదనంతరం దేశభక్తి గీతాల పోటీల్లో జి.కావ్యశ్రీ, డి.దుర్గాగౌతమి, డి.నాగజయశ్రీ మొదటి స్థానం, జి.హేమలత, కె.నిఖిత ద్వితీయ స్థానం, హంసిత, కె.భవ్యశ్రీ, జి.హేమలత తృతీయ స్థానం, డి.లీలావసంత్ కన్సొలేషన్ బహుమతి సాధించారు.

ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలు

కాకుమాను: ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలని పోపూరి లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పెదనందిపాడు అధ్యక్షులు ఎస్.శివప్రసాద్, గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, రమేష్, సాయిబాబు, శాంసన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయిని కొర్రపాటి సువార్త సుహాసినిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: బహిరంగ మలవిసర్జనతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాతమల్లాయపాలెం కూడలి వరకు ర్యాలీ సాగింది. ఎంపీడీఓ శివపార్వతి మాట్లాడుతూ ఆరుబయట మల విసర్జన ద్వారా అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. బహిరంగ మలవిసర్జనను పూర్తిగా మండలంలో నిషేధిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డిని నిర్మించుకునేలా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, వార్డు సభ్యులు డబ్బూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెక్రటరీ జి.ఆర్.కె.మూర్తి ఆధ్వర్యంలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. తుమ్మలపాలెంలో పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు.



ప్రత్తిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శివపార్వతి, ఈవోపీఆర్డీ రవికుమార్

రైతులు పంట నమోదు చేసుకోవాలి

పొన్నూరు: రైతులు ప్రీమియం చెల్లించి పంట నమోదు చేసుకోవాలని పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి తెలిపారు. మంగళవారం మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత పాల్గొని దాల్వా సాగులో అపరాల యాజమాన్య పద్ధతులను వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి దాల్వా సాగులో పంటల బీమా నమోదు చేయించుకోవాలని తెలిపారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ ఎ.శైలజ మాట్లాడుతూ త్వరలో పశు గణన మొదలవుతుందని ప్రతి ఒక్కరూ పశువులని నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో పండిన వరి బీపీటీ 5204, ఇతర సన్నరకం వరి ఏ గ్రేడు 75 కేజీలు రూ.1740, బీ గ్రేడ్ 75 కేజీలు రూ.1725కు రైతులు విక్రయించుకోవాలని మండల ఏఓ దేగల వెంకట్రామయ్య సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రామకోటేశ్వరి

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

కాకుమాను: ప్రస్తుతం వరి పంటపై అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు పంటపై అగ్గి తెగులు ఆశించ కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు. మండలంలోని కాకుమాను, గరికపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని గ్రామాలలో వరి పైరు వివిధ దశల్లో ఉందని, ఈనిక దశ, కోత దశలో పంట పొలాలు ఉన్నాయని ఈ సమయంలో పంటపై అగ్గి తెగులు ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నాయని వివరించారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ

స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు 25 శాతంపై తెల్ల, ఎర్ర శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, తహసీల్దార్ వెంకటస్వామి, ఏఓ కె.కిరణ్మయి పాల్గొన్నారు.

అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటుకు చర్యలు

పొన్నూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లు దాటితే మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీల నాయకులు పలు సమస్యలను తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలం, పట్టణ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 2,592 మంది ఓటు నమోదు చేసుకున్నారని, ఆఫ్‌లైన్లో 1130 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆ ఓట్ల పరిశీలన పూర్తయిందని పేర్కొన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 4 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియా